# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

వ మాస పత్రిక

JULY1996

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను రేడియో కార్యక్రమము ద్వారా మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకములు మావద్ద కలవు. [illegible]ము రూ. 25/ –లు ఈక్రింది అడ్రసుకు M.O. చేసినచో రూ.100/ –లకు మించిన విలువగల 15 నుండి 20 రకముల పుస్తకములు మరియు 2 సంవత్సరములవరకు "సత్యవాక్కు" అను మాసపత్రికను మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయము తెరవండి. మావద్దలభించు పుస్తకముల రేట్ల వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1 | కీర్తన పుస్తకం | రూ.14–00 |
| 2 | పెద్ద అచ్చు బైబిలు | 110–00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75–00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు 2 సంవత్సరముల పాటు సత్యవాక్కు మాసపత్రిక ఉచితం | 25–00 |

గమనిక : మీరు పంపు పైకము **M.O.** ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**SATYA VANI**
Sambamurthi Street, Ramaraopet,
KAKINADA - 533 004.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-63722

Editor :
**J.C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 జూలై 1996 సంచిక 12


## సంపాదకీయము

## నేను దేవుని యందు విశ్వాసముంచుటకు గల కారణములు

### (Why I believe in God)

నేను దేవుని యందు ఏల విశ్వాసముంచుచున్నాను? ఎవరైనా ఆయన యందు ఏల విశ్వాసముంచాలి? ఆయన యున్నాడని మనకెట్లు తెలియును? సృష్టికర్త అంటూ ఒకడు లేడని 'ఈలోక జ్ఞానులు' అనుచున్నారుగదా ? విజ్ఞాన వికాస యుగంలో మనం నివసించుచున్నాముగదా ? పరిణామ సిద్ధాంతము నిరూపింపబడి అంగీకరింప బడియున్నదిగదా ? ఒక బ్రహ్మాండమైన శబ్దముతో ఈ విశ్వము, దానిపై జీవము ఉద్భవించెనని శాస్త్రజ్ఞులు చెప్పుటలేదా ? నీవు, నేను విశ్వాసరహితమైన లోకమును నమ్మిన యెడల సృష్టికర్త అంటూ లేడని

తెలుస్తాము. అయితే మన మేధస్సును, సామాన్యజ్ఞానమును వినియోగించిన యెడల అట్టి ముగింపునకు ఎట్లురాగలము? అందుకే "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" అని దావీదు పలికాడు (కీర్తన 14:1). దేవుడు లేడని ఎంతమంది ఎన్నివాదములు చేసినా, నన్ను నమ్మించ ప్రయత్నించినా, దేవుడున్నాడని నేను నమ్ముదును.

నేను దేవుని యందు విశ్వాసముంచుటకు అనేక కారణములున్నవి. సృష్టిని బట్టియే నేనాయన యందు విశ్వాసముంచుచున్నాను. సృష్టియున్నదంటే సృష్టికర్త అంటూ ఒకడున్నాడు. ఆయనే దేవుడు. "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అని చెప్పబడియున్నది (ఆది. కా. 1:1). దీనిలో గొప్ప జ్ఞానమున్నది.

మానవుని బట్టి, అతనికున్న జ్ఞానమును బట్టి నేనుదేవుని యందు విశ్వాసముంచుచున్నాను. అతడు ఆలోచించగలడు, వివేచింపగలడు. ఇదంతా పరిణామ సిద్ధాంతప్రకారము సంభవించెనని చెప్పువారు అనేక ప్రశ్నలకు జవాబీయవలసియున్నది. మొదటిగా, పరిణామము మానవుని ఊహాజ్ఞానమే. అది నిరూపింపబడిన వాస్తవము కాదు. మానవుడు ఒక జంతువు నుండి పరిణామము చెందితే, ఆ జంతువు అంతకన్నా తక్కువ దశనుండి పరిణామము జెందితే, ఈ పరిణామము ఇంకా కొనసాగింపబడుటలేదేమి? మానవుడు ఇంకా ఉత్కృష్ట దశకు మారలేదేమి ? ఎందుకో తెలుసా? మానవుడు ఒక జంతువు నుండి పరిణామము జెందిరాలేదు ! అతడు దేవునిచే సృజింపబడెను. అతనికొక భౌతిక ఆకారము, ఆత్మీయ స్వరూపము ఇయ్యబడి సృజింపబడ్డాడు, ఆత్మీయంగా అతడు దేవుని స్వరూపమందు ఆయన పోలిక చొప్పున చేయబడ్డాడు. అతనికొక ఆత్మయున్నది. అది నిత్యము జీవించునది. అతడు ఆలోచించగలడు, వివేచింపగలడు (ఆది. కా. 1:26,27; 2:7).

ఆదిలో అమలులోనికి తేబడిన ప్రకృతి సూత్రమును బట్టి నేను దేవుని యందు విశ్వాసముంచుచున్నాను. నాటి నుండి నేటి వరకు ప్రకృతి అంతయు దోషరహితంగా, పరిపూర్ణముగా పనిచేయుచున్నది. పగటిని ఏలుటకు సూర్యుడు, రాత్రిని ఏలుటకు చంద్రుడు ఉన్నారు. క్రమము తప్పకుండా వచ్చు రుతువులున్నాయి. భూవాతావరణం అంతా సమశీతలమైనది. ప్రతిజాతి యొక్క ఉత్పత్తి సూత్రమునుబట్టి సృష్టి జరిగిన నాటినుండి ఆ జాతి ఉద్భవించుచునే యున్నది. మానవజాతి కూడ అదే సూత్రముపై అభివృద్ధిజెందుచున్నది, పోషింపబడుచున్నది. యిదంతయు ఒక మహోన్నతుని వలన చలింపజేయబడుచున్నది. ఆయనే దేవుడు.

బైబిలు దేవుని ఉనికిని స్పష్టము చేయుచున్నది గనుక నేను దేవుని యందు విశ్వాసముంచుచున్నాను. ఆయన ఎల్లప్పుడు ఉండువాడు. ఆయన ఆత్మయైయున్నాడు, సర్వ శక్తిమంతుడు, సర్వజ్ఞాని, సర్వాంతర్యామియై యున్నాడని బైబిలు చెప్పుచున్నది. ఈ వాస్తవములను ఎవరు కాదనజాలరు.

దేవుడు మన భౌతికావసరములను, ఆత్మీయావసరములను తీర్చుచున్నాడు గనుక నేనాయన యందు విశ్వాసముంచుచున్నాను. ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసు క్రీస్తును మన పాపముల నిమిత్తమై మరణించుటకు పంపెను. తద్వారా మనకు నిత్యజీవము కలుగును. అందువలన మనము పాపములనుండి విముక్తిపొంది ఆయనతో నిత్యము జీవించగల్గు అవకాశమును ఆయన కల్పించియున్నాడు.

దేవుడున్నాడు గనుక ఒక శ్రేష్ఠమైన జీవితం జీవించుటకు మనకు అవకాశం ఇయ్యబడింది. నేనాయన యందు విశ్వాసముంచుచున్నాను గనుక నా సంతోషము అధికమై నిరీక్షణ కలిగి జీవించగల్గుచున్నాను. నేనాయన యందు విశ్వాసముంచుచున్నాను గనుక ఆయనకు విధేయుడను. ఆయనను

ఆరాధింతును, సేవింతును. తత్ఫలితముగా ఈలోకములో ఆయనచే దీవించబడుటయేగాక, రాబోవులోకములో ఆయన సన్నిధిలో నిత్యము జీవించెదనను వాగ్దానమును నిరీక్షణను కలిగిన వాడనైయున్నాను.

అయితే ఆయన యందు విశ్వాసముంచనివారి సంగతియేమిటి ? వారు ఈలోకంలో పాపము యొక్క పర్యవసానము ననుభవించుటయేగాక, చిట్టచివరకు నరక పాత్రులగుదురు. అక్కడ అపవాదితోను, వాని దూతలతోను నిత్యము వారు కాలము గడుపుదురు. అవిశ్వాసము యొక్క మూల్యము చాల భయంకరమైనది.

మనం జ్ఞానులమైతే మన సృష్టికర్తను స్మరణకు తెచ్చెకొందుము. అందువలన మనకు మేలే గాని కీడు కలుగదు. మన మాయనయందు విశ్వసించినను, విశ్వసించకపోయినను సరే, ఆయన మాత్రము ఎల్లప్పుడు యున్నాడు! నీవు దేవుని యందు విశ్వసించి ఆయనకు విధేయుడవగుదువనియే నా నిరీక్షణ (హెబ్రీ 11:6).

## దేవుని యందు విశ్వాసము

### (Faith in God)

(గత సంచిక తరువాయి)

మనము ఆయన చెప్పినంత మట్టుకు చేయువారముగా ప్రభువునందు నమ్మిక యుంచవలెను. ఇందు చేతనే విశ్వాసము ఒక్కటి మాత్రమే రక్షించలేదు. ఎందుకనగా అది మృతము, "ఆలాగే విశ్వాసము, క్రియలు లేనిదైతే అది ఒంటిగా నుండి మృతమైనదగును" అని యాకో 2:17 లో చెప్పబడి యున్నది. "మనుష్యుడు విశ్వాసమూలము మాత్రము గాక క్రియలు మూలమున నీతి మంతుడని యెంచబడెనని, మీరు దీనివలన గ్రహించితిరి" (యాకోబు 2:24).

"ప్రాణములేని శరీరము ఏలాగు మృతమో ఆలాగే క్రియలు లేని విశ్వాసమును మృతము" (యాకోబు 2:26). ఈ ఉద్రేకపూరితమైన మాటలతో యాకోబు రక్షించబడుటకు విశ్వాసము ఒక్కటి మాత్రమే గాక అంతకన్న ఎక్కువ కావలసియున్నదని చూపించుచున్నాడు. అతడు ఒకటి కన్న ఎక్కువ ఉదాహరణలను పేర్కొనెను.

విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలునని బోధించు కొందరు బోధకులు యోహాను 3:16 ను వారి వాదనలకు ఉదాహరణగా పేర్కొనుచున్నారు. కాని విశ్వాసము మాత్రమే యనుదాని విషయములో క్రీస్తు ఏమియు చెప్పలేదు. మనము దేవునియందు నమ్మిక యుంచిన మనము నశింపక నిత్యజీవము పొందదుమని చెప్పెను. కాని ఒక ప్రశ్న యేమనగా దేవునిని, ఆయన వాక్యమును నిజముగా నమ్మిన వ్యక్తి ఏమి చేయును? అతడు ప్రభువును అంగీకరించును. అదియే ఇక్కడ జవాబు.

## విశ్వాసము ద్వారా కృపచేతనే

రోమా 5:1లో వ్రాయబడినట్లు విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడితిమి. కాని ఒక్క విశ్వాసము వలన మాత్రమే కాదు. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు" (ఎఫెసీ 2:8). అంతే కాని విశ్వాసము ద్వారా మాత్రమే కాదు. మారుమనస్సు, బాప్తిస్మము, క్రైస్తవ జీవితము లేకుండా ఒకడు రక్షించబడునని ఎవరును వాదించరు కాని విశ్వాసము మాత్రమే యనువారు అట్టివారుగా పరిగణింపబడుదురు. ఇచట సమస్యయంతయు విశ్వాసము యొక్క అర్థము మీదనే యున్నది. బైబిలు బోధించునది జీవము కల్గి, కదలుచుండెడి, పనిచేయుచుండెడి విధేయత కల్గిన విశ్వాసము. ఇట్టి విశ్వాసమును పక్షవాయువుగల రోగిని ఆయన యెదుటకు తెచ్చినప్పుడు యేసు చూచినట్లు

చదివితిమి (మత్తయి 9:2). మనమాటలను కాదుగాని క్రియాపూర్వకమైన విశ్వాసమును చూడవలెనని ప్రభువు కోరుచున్నాడు. మన చేతల ద్వారా, ఆయన ఆజ్ఞల యెడల మన విధేయత ద్వారా మనము నిరూపించి రుజువు చేయవలెనని ఆయన కోరుచున్నాడు. లేని యెడల మన విశ్వాసమమృతమే, వ్యర్థమే.

## సువార్త ఆజ్ఞలు

విశ్వాసము క్రీస్తు సువార్త యొక్క ఆజ్ఞలలో ఒకటి. ఇది దేవుని వాక్యమును వినుట ద్వారా కల్గును (రోమా 10:17). ఇది ఒకనిని క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తీస్మము పొందునట్లు చేయును. విశ్వాసము లేనిదే ఈ యాజ్ఞలకు లోబడుట యుండదు. స్వచ్ఛమైన విశ్వాసము విధేయతను కలుగజేయును. ఇది ప్రభువు యొక్క ఆజ్ఞలను ప్రశ్నించదు కాని వాటిని నెరవేర్చును. అది బోధలను తృణీ కరించక వాటిని పాటించును.

"నమ్మిబాప్తీస్మము పొందిన వాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును'' అని క్రీస్తు చెప్పెను (మార్కు 16:16). ఒకనికి నమ్మిక యున్న యెడల అతడు క్రీస్తును అంగీకరించును, బాప్తీస్మము పొందును. ఇది చాలా సామాన్యమైనది కదా. అపొస్తలుల కార్యములలోని అన్నిమత మార్పులలోను బోధించుటకు ఒక బోధకుడు, ఒక పాపియునున్నారు. కావున ఒకడు విని, సువార్తను నమ్మి, తన పాపములకై పశ్చాత్తాపపడి, క్రీస్తును ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తీస్మము పొందును. ఏమి వాటిల్లును? ఒకసారి ఒక వ్యక్తి సువార్తను విని దానిని నమ్ము స్థితికి వచ్చిన యెడల మిగతా వాటి విషయమై సమస్యలేదు. ఎందుకనగా అతడు ప్రభువు యొక్క ఆజ్ఞలు పాటించుటకు సిద్ధపడి యున్నాడు. ఈ మార్పు అంతా ఒకడు నమ్మెనా లేదా అను దానిపై ఆధారపడి యున్నది.అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయములో

నమ్మిక లేని యొక గుంపును గురించి చదువుదుము. వారిలో కొందరికి క్రీస్తును సిలువ వేయుటలో పాత్ర యున్నది. వారికి పేతురు, అపొస్తలులు సువార్తను బోధించిరి. క్రీస్తు ఎట్లు నిజముగా దేవుని కుమారుడో వారికి చూపించిరి. వారిని ఒప్పించినపుడు ఉత్పన్నమైన ప్రశ్న : "మేమేమి చేతుము" ? అనునది (అపొ.కా. 2:37). సమరయలో ఫిలిప్పు సువార్త ప్రకటించినపుడు అనేకమంది నమ్మిబాప్తీస్మము పొందినట్లు వ్రాయబడెను (అపొ.కా. 8:12). ఫిలిప్పు నపుంసకునికి క్రీస్తును బోధించినపుడు, అతడు ఏమి చేయవలెనో అడిగి తెలుసుకొని, అట్లుచేసి, సంతోషించుచూ వెడలినట్లు వ్రాయబడెను (అపొ.కా. 8:26-39). అపొ.కా. 16 లో పౌలు, సీలలు చెరసాల నాయకునికి రక్షించబడుటకు విశ్వసించవలెనని చెప్పిన యుదంతము కలదు. కాని అతడు ఒక అవిశ్వాసి. కావున వారు అతనికి అతని యింటివారికి దేవుని వాక్యమును వారు నమ్మునట్లు బోధించిరి. దాని ఫలితంగా చెరసాల నాయకుడు వారి గాయములు కడిగి తన మారుమనస్సును చూపించి, అతడును, అతని యింటివారును బాప్తీస్మము పొందినట్లు వ్రాయబడెను (అపొ.కా. 16:30-33). మిగతా మత మార్పులలో కూడా ఈ విధముగనే యున్నవి.

ఆఖరుగా, విశ్వాసము ఒక్కటే యని లేఖనములు చెప్పుచున్నవి (ఎఫెసి 4:5). బైబిలు ఒకటే, దానిని అందరూ అంగీకరించి, నమ్మిన యెడల మనకు అట్టి విశ్వాసము కలిగి ప్రభువును అంగీకరించి ఆయన యెడల నమ్మకముగా యుందుము.

(సమాప్తం)

-జె.పి. ఛోట్.

# సరియైన ధనము కూర్చుకొనుట

## (Proper Laying of Treasure)

(మత్తయి 6 : 19 - 23)

బైబిలులో ఒక ప్రాముఖ్యమైన లేఖన భాగము మత్తయి 6:19-24 వరకు మనకు కన్పడతాది. కొండ మీద ప్రసంగము చేస్తు యేసు ప్రభువు ఇట్లు అన్నారు : "భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు. ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగిలించెదరు. పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనమెక్కడ ఉండునో అక్కడనే నీ హృదయముండును. దేహమునకు దీపము కన్నేగనుక నీ కన్ను తేటగా ఉండిన యెడల నీ దేహమంతయు వెలుగుమయమై యుండును. నీ కన్ను చెడినదైతే నీ దేహమంతయు చీకటిమయమై ఉండును. నీలోనున్న వెలుగు చీకటియై యుండిన యెడల ఆ చీకటి ఎంతో గొప్పది. ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని, సిరికిని దాసులుగా నుండనేరరు."

ధనము కూర్చుకొనుటను గూర్చి ప్రభువు ఇక్కడ చెప్పి యున్నారు. ఒకని జీవితంలో దేనికైతే అతడు ప్రాధాన్యత యిస్తాడో, అది అతనికి ధనం కావచ్చును. మిగతా వాటన్నిటికంటె దానిని అతడు ఎక్కువ ప్రేమిస్తాడు. మనం చదువుకొనిన వాక్యభాగంలో యేసు ప్రభువు భూసంబంధమైన ధనానికీ, పరలోక సంబంధమైన ధనానికీ తారతమ్యమును చూపించారు.

# ఈ లోక ధనం

భూ సంబంధమైన ధనం, భూమి మీదనే కూర్చుకొనబడతాది. భూమిమీదనే దాచబడతాది. అది బంగారము కావచ్చు వెండి కావచ్చు మరింకేమైనా కానచ్చు. అయినను అది భూసంబంధమైనదే. గనుక అది పరిపూర్ణమైనది కాదు.ఏలయనగా ఆ ధనం విలువైన వస్త్రములు, కాగితములు వగైరా అయితే దానిని చిమ్మెట తినివేయును. ఇత్తడి, వెండి, కంచు మొదలైన లోహములైతే వాటికి తుప్పుపట్టును. అవినాశనమగును. అయినను ఎంతో పదిలముగను, భద్రముగను వాటిని దాచియుంచిన యెడల దొంగలువాటిని దొంగిలించవచ్చును. దొంగలు ఇంటికి కన్నము వేయవచ్చును, లేదా ఇనుప బీరువాలను పగులగొట్టవచ్చును, లేదా ఇంకేమైనా చేసి ఆ ధనాన్ని ఒక్కనాడే ఎత్తుకొని పోవచ్చును. యింకా ఒకని జీవితంలో ఇవన్నీ జరుగకపోతే తాను సమకూర్చుకొనిన ధనాన్ని అనుభవించకముందే అతనికి మరణము సంభవించవచ్చును. అందుకే భూమి మీద మీ కొరకు ధనము కూర్చుకొనకుడి యని యేసుప్రభువు చెప్పారు.

భూ సంబంధమైన ధనము నమ్మదగినది కాదు. దానిని మనం ఎంత భద్రముగా ఉంచినా అది అంత తాత్కాలికమైన్నది. అది భూమిమీద దాచబడినది గనుక భూమి మీదనే మిగిల్చివేయబడును; లేదా వదిలి పెట్టబడును. భూమి మీద ఉద్భవించిన వారందరికీ ఒకటి తెలుసు -అదేమంటే ఈ లోకం వారి శాశ్వత గృహం కాదు అనేది. ఈ భూమి సృష్టింపబడిన నాటి నుండి దాని అంతము సంభవించేవరకు అది నిలిచి ఉండవచ్చును. గాని దానిపై ఉద్భవించిన తరముల వారి సంగతి అట్లు చెప్పుకొనలేము. వారునేడుంటారు. రేపు లేకుండా పోతారు.

భూ సంబంధమైన ధనాన్ని కూర్చుకొనుటలో మానవుడు ఉన్నతుడగుట మాని అధోగతికి పాలగును; ధనవంతుడగుటమాని ధనహీనుడగును. భూమి మీద ధనమును ఎందుకు కూర్చుకొనరాదో ప్రభువు చెప్పుచున్నారు : భూమి మీద ఒకడు సమకూర్చుకొనిన ధనం అతని హృదయాన్ని భూమికి సంకెళ్ళు

వేసి బిగిస్తాది. "నీ ధనమెక్కడ ఉండునో అక్కడనే నీ హృదయముండును." ఇంకా ఆ ధనం ఏమైయున్నదో దాని ప్రకారము మానవుని హృదయం మల్చబడును. నీవు త్వరలో ఖాళీ చేసి వెళ్ళిపోవలసి వచ్చు ప్రదేశములో నీ ధనాన్ని దాచుకొనడం ఎంత బుద్ధిహీనతయో గదా! నిన్ను యజమానిగా గాక, ఒక బానిసగా తయారు చేసే ధనాన్ని సమకూర్చుకొనడం ఎంత తెలివితక్కువ! నీవు ఈ లోకంలో ధనాన్ని కూర్చుకొనే కొలది నీ బుద్ధికుశలత కుంటుబడును, ఉన్నత భావోద్రేకములను కోల్పోతావు. చివరకు ఒక లోభిగా తయారవుతావు.

అందువలననే యేసు ప్రభువు మరల ఈ లాగున బోధించారు : "మీరు ఏవిధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్తపడుడి; ఒకని కలిమివిస్తరించుటవాని జీవమునకు మూలముకాదు..ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా పండెను. అప్పుడతడు నా పంట సమకూర్చుకొనుటకు నాకు స్థలము చాలదు గనుక నేనేమి చేతునని తనలో తానాలోచించుకొని - నేనీలాగు చేతును; నా కొట్లు విప్పి వాటికంటె గొప్పవాటిని కట్టించి, అందులో నా ధాన్యమంతటిని, నా ఆస్తిని సమకూర్చుకొని, నా ప్రాణముతో - నా ప్రాణమా, అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్థి నీకు సమకూర్చబడి యున్నది; సుఖించుము, తినుము, త్రాగుము, సంతోషించుము అని చెప్పుకొందుననుకొనెను. అయితే దేవుడు - వెర్రివాడా ఈ రాత్రి నీ ప్రాణమునడుగుచున్నారు; నీవు సిద్ధపరచినవి ఎవనివగునని అతనితో చెప్పెను. దేవుని యెడల ధనవంతుడు కాక తనకొరకే సమకూర్చుకొనువాడు ఆలాగుననే యుండునని యేసు ప్రభువు చెప్పెను" (లూకా 12 : 15 - 21).

ఈ ధనవంతుడు విస్తారమైన ఆస్థిని సమకూర్చుకొన్నాడుగాని, దానినంతటిని ఆ రాత్రికి రాత్రే వదలి వెళ్లిపోవలసి వచ్చెను.

## పరలోక ధనం

పరలోకమందు మీ కొరకు ధనము కూర్చుకొనుడి. అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు. దొంగలు కన్నము వేసి దొంగిలరు అని యేసు ప్రభువు చెప్పారు. మనం ధనము సమకూర్చుకోవలసిన

ఈ పరలోకం యేమిటి? అది దేవుని నివాస స్థలము. గనుక పరలోకంలో ధనం సమకూర్చుకొనుట అంటే దేవుని దగ్గర ధనం సమకూర్చుకొనుట యని అర్థము. మన ఆస్థియావత్తు ఆయనతో యుంచడం, మనసమస్తం, ఆయనకు సమర్పించడం, మరియు మనం ఆయన దగ్గరకు వెళ్లినప్పుడు మనం ఆయన దగ్గర ధనవంతులుగా కనబడతాం అనేది గొప్ప నిర్ధారణమై యున్నది.

అయితే పరలోకమే మన ధనాగారమైతే దానిలో భూసంబంధసంగతులు గాక, ఆత్మీయ సంగతులు, లేక పరలోక సంగతులు దాచబడతాయి. గనుక వెండి బంగారములతో మన ఆస్థిని లేక ధనాన్ని అక్కడ అంచనావేయుట జరుగదు. ఏలయనగా అట్టి క్షయమైన వస్తువులకు అక్కడ తావులేదు. అయితే క్రీస్తులో నిక్షిప్తమైన ఐశ్వర్యము అక్కడ యున్నది. విశ్వాసము, ప్రేమ, క్షమ, శాంతి, జీవము, సంతోషము, పవిత్రత, పరిశుద్ధత మొదలైనవి పరలోక వాతావరణంలో తార్కాణమవుతాయి.

అంతేగాక పరలోక ధనాగారము చాల భద్రమైనది, క్షేమ కరమైనది. పరలోక వాతావరణం లోనికి క్షయమైన దేదీ ప్రవేశించదు. అచ్చట చిమ్మెటయైనను తుప్పైనను తినివేయదు. దాని బంగారు వీధులలోనికి లేక గుమ్మములలోనికి ఏ దొంగ ప్రవేశించడు. అప్పటికి దొంగలందరు అగ్ని గంధకములతో మండు గుండములో మాడుచు యుంటారు. ఆ నిత్యజీవిత ప్రదేశములో ప్రవేశించడానికి మరణానికి ఏ విధమైన బలము లేదు. అందువలన క్రీస్తులో మనం సంపాదించుకొన్న ఆత్మీయవరములను దొంగిలించడానికి గాని, హరించడానికి గాని, దేనికి, ఎవనికీ అక్కడ శక్తి లేదు.

మనధనమున్నచోటనే మన హృదయం ఉంటే, ఆ ధనం పరలోకంలో యుంటే మన హృదయం, పైనున్న వాటినే గాని, క్రిందనున్న వాటిని వెదుకదు. పరలోకమువైపే మన ఆత్మ ఎల్లప్పుడు ఆకర్షింపబడతాది. సరిగదా పరలోకధనము అనిశ్చయమైనది కాక, అశాశ్వతమైనది కాక అది నిశ్చయమైనది, శాశ్వతమైనది. ఒకడు చనిపోగానే ఈ ధనాన్ని కోల్పోడు, సరిగదా దాన్ని పొందుతాడు.

దేహమునకు దీపము కన్ను. కంటి ద్వారానే ఒకడు తన మార్గమును తేటగా చూడగలుగుతాడు. ఒకడు ఆత్మీయ విషయాలను గూర్చి సరియైన

అవగాహన కలిగినవాడైతే అతడు ఆత్మీయ సంగతుల యొక్కయు, ఆత్మీయ ఐశ్వర్యము యొక్కయు విశిష్టతను తేటగా చూడగలుగుతాడు. దేవునికి సిరికి దాసులుగా యుండవచ్చుననుకొనే వారు అతి తీవ్రమైన పొరబాటుమ చేయుటయే గాక తమ్మును తామే వంచన చేసికొనువారవుతారు. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు. దేవుడు మననుండి పాక్షికమైన సేవను అంగీకరించడు. మనం ఆయనను పూర్ణహృదయముతోను, పూర్ణమనస్సుతోను, పూర్ణ ఆత్మతోను సేవించాలని ఆయన కోరుచున్నాడు (లూకా 14 : 26-33). అయితే అపవాది మన పాక్షికమైన సేవను సంతోషంతో అంగీకరిస్తాడు. ఏలయనగా మనం పాక్షికంగా అతని వైపు ఉంటే పూర్తిగా అతనివైపు ఉన్నట్లే లెక్క!

పరలోకములో ధనమును కూర్చుకొనుడి యని యేసు ప్రభువు చెప్పినప్పుడు మానవులు పరలోక సంగతులను ప్రేమించాలని, వెదకాలని, ధనం వలె దాచుకోవాలని హెచ్చరిక చేసియున్నారు. దేవుని, యేసు ప్రభువును, ఆయన సంఘమును అన్నిటికంటె అందరికంటె ఎక్కువ ప్రేమించాలి. "ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలను, అన్నదమ్ములను, అక్క చెల్లెండ్రను, తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు. మరియు ఎవడైనను తన సిలువను మోసికొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడు". "ఆ ప్రకారమే మీలో తనకు కలిగిన దంతయు విడిచిపెట్టని వాడు నా శిష్యుడు కానేరడు" అని యేసు ప్రభువు బోధించారు (లూకా 14:26-28;33), అందువలననే అపొ.పౌలు ఈలోకసంబంధమైన సంగతులు తనకు ఏవేవి లాభకరములై ఉండెనో వాటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొన్నాడు (ఫిలిప్పీ 3 : 7). "ఒక మనుష్యుడు ఈ లోక మంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము ? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా నేమి యియ్యగలడు?" (మత్తయి 16 : 26).

నీవు పరలోకములో ధనమును కూర్చుకొనాలంటే యేసు ప్రభువు నందు విశ్వసించాలి. నీ పాపముల విషయమై నీవు మారు మనస్సు పొందాలి. యేసు ప్రభువును నోటితో ఒప్పుకొనాలి, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము

పొందాలి. అట్లు చేసి నీవు క్రైస్తవుడవై, క్రీస్తు సంఘ సభ్యుడవై, సత్కార్యములు చేస్తు జీవించాలి. నిత్యజీవ కిరీటమును నీకాయన బహూకరిస్తారు. దానిని మించిన ధనం ఇంకేమి ఉంటాది?

- జాషువా గూటం

## మనము పాత నిబంధన చట్టముల క్రింద ఎందుచేత లేము ?
## (Why we are not under the Old Testament Laws)

దేవుని స్వరూపమందు ఆయన చేత సృజింపబడి, ఆయన జీవ ఊపిరిని ఊదగా నేల మంటితో నిర్మితమైన మానవుడు జీవాత్మ ఆయెనని పరిశుద్ధ గ్రంథము తెలియ జేయుచున్నది. ఏదేను వనమందలి మానవునికి దేవుడు తన మొదటి ఆజ్ఞను యిచ్చెను: "మరియు దేవుడైన యెహోవా - ఈతోటలో నున్న ప్రతి వృక్ష ఫలములను నీవు నిరభ్యంతరముగ తినవచ్చును. అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదు" (ఆది 2:16-17). తరువాత ఇశ్రాయేలీయులను తన ప్రజలనుగా ఆయన ఎన్నుకొని సీనాయి పర్వతముపై పది ఆజ్ఞలను అనేక చట్టములను ఆరాధనా సూత్రములను అరణ్యములో వారికిచ్చెను.

## ధర్మశాస్త్రమెందుకీయబడెను?

పాపమనునది ఏమిటో అతడెరుగునట్లు దేవుడనేక చట్టములను యిచ్చెను. "ఏలయనగా ధర్మశాస్త్రసంబంధమైన క్రియల మూలముగా ఏమనుష్యుడును ఆయన దృష్టికి నీతి మంతుడని తీర్చబడడు. ధర్మశాస్త్రము వలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది" (రోమా 3:20). పాపమనగా

ఎట్టిదో మానవుడు తెలిసికొని దాని నుండి తిరుగునట్లు దేవుడు మానవునికి చట్టమును యిచ్చెను. I యోహా 3:4 నందు ఆయన ఈ విషయము తెలియజేయుచున్నాడు: "పాపము చేయు ప్రతి వాడును ఆజ్ఞను అతిక్రమించును. ఆజ్ఞాతి క్రమమే పాపము". మనము ఆజ్ఞను అతిక్రమించిన యెడల అది పాపము. దానిని బట్టి ఆజ్ఞలేనప్పుడు పాపమును లేదు.

గలతీ 3:19లో ఆత్మ తేటగా చెప్పుచున్నాడు: "ఆలాగైతే ధర్మశాస్త్రమెందుకు? ఎవనికి ఆ వాగ్దానము చేయబడె ఆ సంతానము వచ్చువరకు అది అతిక్రమములను బట్టి దానికి తరువాత ఇయ్యబడెను." దీనివలన మానవునికి ఆ సంతానమైన క్రీస్తు అవసరమని వారు గ్రహించునట్లు ధర్మశాస్త్రము యివ్వబడెను.

ధర్మశాస్త్రము మనలను రక్షించదు మన ప్రభువైన క్రీస్తు యేసునందు విశ్వాసము వలనను, ఆయనకృపను బట్టి మనము రక్షింపబడగలము. రోమా 5:20 మరియు 7:13 చదివిన యెడల ధర్మశాస్త్రము ఎందుకీయబడెనో మనము గ్రహించగలము.

ఈనాడు చాలామంది సర్వశక్తి మంతుడైన దేవునిని పాత, క్రొత్త నిబంధనలను బట్టి ఆరాధించుచున్నారు. కొందరు యాంత్రిక సంగీతము తోను, దశమ భాగములతోను, సబ్బాతును ఆచరించుట ద్వారాను, ధూపములు వేయుట ద్వారాను, ఆరాధించుటకు ప్రత్యేక వస్త్రధారణతోను, ప్రత్యేక యాజకత్వము జరిగించుట ద్వారా దేవుని ఆరాధించుచున్నారు. పాత నిబంధన చట్టమునకు నేడు మనము లోబడవలసియున్నాదా ?

## ధర్మశాస్త్రము ఎవరికియ్యబడెను ?

ఇశ్రాయేలీయులకు మాత్రమే ధర్మశాస్త్రమియ్యబడెను. అన్యులకు కాదు. ఆసమయంలో ఐగుప్తువారు కలరు. వారు ధర్మశాస్త్రమునకు లోబడనవసరము లేదు. సిరియ, అష్షూరు వారు, ఫిలిష్తీయులు, బబులోనువారు, అమాలేకీయులు ఏదోమీయులు, పర్షియా వారు, మిద్యానీయులు వీరెవరికీ యిది వర్తించదు.

ఎందుకనగా ధర్మశాస్త్రము వారికివ్వబడలేదు. ఆకాలములో ఈ జనాంగములన్నియు ఉన్నను వారు ధర్మశాస్త్రాను సారులు కాదు. సర్వశక్తి మంతుడైన తండ్రి ఇశ్రాయేలీయులను మాత్రమే తన ప్రజలనుగా ఎన్నుకొని వారికి ధర్మశాస్త్రమిచ్చెను. అన్యజనాంగము ఎవరుమ క్రీస్తు మరణమునకు ముందు దేవుని ఆజ్ఞలకు విధేయులైనట్లు బైబిలు నందు ఎక్కడ వ్రాయబడలేదు. ఉదా : సబ్బాతు ఆచరణను బట్టి ఆనాటి అన్యులు తీర్పుతీర్చబడుదురా ? కాదు. వారు ప్రకృతి ధర్మమును బట్టి తీర్పుతీర్చబడుదురు. దుష్టులెవరూ శిక్షను తప్పించుకొనలేరు. "దేవునికి పక్షపాతము లేదు. ధర్మశాస్త్రము లేక పాపము చేసిన వారందరు ధర్మశాస్త్రము లేకయే నశించెదరు. ధర్మశాస్త్రము కలిగిన వారై పాపముచేసిన వారందరు ధర్మశాస్త్రనుసారముగా తీర్పు నొందుదురు. ధర్మశాస్త్రము వినువారు దేవుని దృష్టికి నీతిమంతులు కారుగాని ధర్మశాస్త్రమును అనుసరించి ప్రవర్తించువారే నీతిమంతులుగా ఎంచబడుదురు. ధర్మశాస్త్రములేని అన్యజనులు స్వాభావికముగ ధర్మశాస్త్రసంబంధమైన క్రియలను చేసిన యెడల వారు ధర్మశాస్త్రములేని వారైనను, తమకుతామే ధర్మశాస్త్రమైనట్లున్నారు". రోమా 2:12-14.

## ధర్మశాస్త్రమును నెరవేర్చుటకు క్రీస్తు

మత్త 5:17-18 వచనాల యొక్క భావాన్ని వివరించుటలో చాలామంది పొరబడుచున్నారు. "ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయవచ్చితినని తలంచ వద్దు. నెరవేర్చుటకే గాని కొట్టి వేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియుగతించి పోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరు వరకు దాని నుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పి పోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" అని యేసు చెప్పెను. క్రీస్తు చెప్పిన ఈబోధవిని చాలామంది, శాఖలవారు, పలుసంఘాలవారు కలవరపడుచున్నారు. అట్టివారిలో నీవున్నావా ? అయితే జాగ్రత్తగా చదువు. ధర్మశాస్త్రమును ప్రవక్తల వచనములను క్రీస్తు నెరవేర్చెను. పాతనిబంధనను కొనసాగించుటకు లేదా కొన్ని ఆజ్ఞలను క్రొత్త నిబంధనతో చేర్చుటకు క్రీస్తు వచ్చెనని కొందరు

బోధించుచున్నారు. అది అసత్యము. ఆయన శరీరమందు పాత నిబంధనను కొట్టివేయుటకు క్రీస్తు వచ్చెనని బైబిలును చదువునప్పుడు నీవు గ్రహించగలవు. "నెరవేర్చుట" అనుమాట యొక్క మూలపదము గ్రీకు భాషలో "ప్లేరూ" (Pleroo) అని వ్రాయబడి యున్నది. "నిజమగుట" (To come True) అని ఈ పదం యొక్క అర్థము.

నెరవేర్చుట అనగా చేర్చుట లేక కొనసాగించుట కాదు. వెబ్ స్టర్ నిఘంటువు నందు ఈ మాటకు "ఒక బాధ్యతను నెరవేర్చుట", "పూర్తి చేయుట", "సమాప్తము చేయుట" అను అర్థములు వ్రాయబడి నవి ధర్మశాస్త్రమునందు ప్రవక్తల వచనముల యందు క్రీస్తును గూర్చి వ్రాయబడినవి నెరవేర్చుటకు లేదా పూర్తి చేయుటకు ఆయన వచ్చెను. ధర్మశాస్త్రమనగా కొందరు భావించునట్లు పది ఆజ్ఞలు కాదు. ఆదికాండము మొదలుకొని ద్వితీయోపదేశ కాండము వరకు మోషే చేత వ్రాయబడినది ధర్మశాస్త్రము.

18వ వచనాన్ని పరిశీలిద్దాం. "ఆకాశమును భూమియు గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దాని నుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను".

క్రీస్తు ధర్మశాస్త్రమును నెరవేర్చెను. అందు వ్రాయబడిన ప్రవచనము లన్నియు ఆయనలో నెరవేర్చబడెను. అందు వ్రాయబడిన క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానములు మరియు ఆయన ఆరోహణముతో పాటు నెరవేర్చబడెను. యింకా వివరంగా తెలిసికొందాం. "అంతట ఆయన - మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంథముల లోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడిన వన్నియు నెరవేరవలెనని నేను మీ యొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను. అప్పుడు వారు లేఖనములు

గ్రహించునట్లుగా ఆయన వారి మనస్సులను తెరచి...." (లూకా 24:44-45).

క్రీస్తు పునరుత్థానుడై లేచిన తరువాత శిష్యులకు ఒక గదిలో ప్రత్యక్షమై మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంధములలోను కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవి నెరవేరినవని చెప్పెను.

ఈ వచన భాగంలో మోషే ధర్మశాస్త్రము అంటే పది ఆజ్ఞలు అనే భావంతో చెప్పబడలేదు. ఆది కాండము మొదలుకొని ద్వితీయోపదేశ కాండము వరకు వ్రాయబడినది ధర్మశాస్త్రము. ఇశ్రాయేలీయులకు దేవుడిచ్చిన నిబంధన క్రీస్తు సంబంధమైనది కాదు. కాని ఈ గ్రంధాలలో మోషే క్రీస్తును గూర్చి వ్రాసిన వచన భాగాలున్నాయి. అలాగే ప్రవక్తల గ్రంధాలలోను, కీర్తనలయందు క్రీస్తును గూర్చిన ప్రవచనాలున్నాయి. క్రొత్త నిబంధనలో అవిక్రీస్తునందు నెరవేర్చబడినవి. యిప్పుడు మనం ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంధాలలోను, కీర్తనలలోను తన్ను గూర్చి వ్రాయబడిన ప్రవచనములు ఎట్లు నెరవేర్చెనో తెలిసికొందాము. కేవలం కొన్ని వచన భాగాలు ఉదాహరణగా చూపించాలని ఆశిస్తున్నాను.

## ప్రవచవ నెరవేర్పు

దేవుడు అబ్రాహామునకు వాగ్దానము చేసెను : "మరియు నీవు నామాట వినినందున భూలోకములోని జనము లన్నియు నీ సంతానము వలన ఆశీర్వదించబడును" (ఆది 22:18). ఈవాగ్దానము క్రీస్తును గూర్చి చేయబడినదని మన మెట్లు తెలిసికొనగలము? మత్త 1:1 క్రీస్తు అబ్రాహాము కుమారుడని తెలియజేయుచున్నది. ఇశ్రాయేలీయులు కూడ అబ్రాహాము సంతానమే, అయినప్పటికిని (ఆది 22:18) క్రీస్తే ఆ సంతానమని స్పష్టముగ బోధించుచున్నది. క్రీస్తు ధర్మశాస్త్రమును నెరవేర్చెను.

"అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను. ఆయన అనేకులను గూర్చి అన్నట్టు సంతానములకును అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టే నీ సంతానమునకును అనెను". ఆ సంతానము క్రీస్తు. గలతి 3:16. క్రీస్తు వాగ్దానమును నెరవేర్చెనా ? అవును నెరవేర్చెను.

ద్వితీ 18:16 ఈలాగు బోధించుచున్నది : "నీ దేవుడైన యెహోవా నీ మధ్యను నావంటి ప్రవక్తను నీ సహోదరులలో నీ కొరకు పుట్టించును. ఆయన మాట నీవు వినవలెను". ఈ వచన భాగము యొక్క నెరవేర్పును గూర్చిన సమాచారము అపొ. 3:19-26 నందు చదువగలము. ధర్మశాస్త్ర మందు క్రీస్తును గూర్చి వ్రాయబడిన ప్రవచనముల నెరవేర్పును క్రొత్త నిబంధన గ్రంధమందు చదువగలము.

కీర్తనల గ్రంధమందు దావీదు యిట్లు చెప్పెను "నా వస్త్రములు వారు పంచుకొనుచున్నారు. నా అంగీకొరకు చీట్లు వేయుచున్నారు" కీర్త 22:18. దావీదు ఈ విషయాన్ని తనగురించి చెప్పెనా ? లేక వేరొకరిని గూర్చి చెప్పెనా? యోహా 19:23-24 చదివినయెడల "వారు దానిని చింపక అది ఎవనికి వచ్చునో అనుదానికోసరము చీట్లు వేయుదమని యొకరితో ఒకరు చెప్పుకొనిరి". కీర్తనలలోను, ప్రవక్తల గ్రంధములలోను, ధర్మశాస్త్రమందు క్రీస్తును గూర్చి వ్రాయబడిన ప్రవచనాల నెరవేర్పును గ్రహించుచున్నావా ?

కీర్త 16:10లో దావీదు చెప్పెను "ఎందుకనగా నీవు నా ఆత్మను పాతాళములో విడచి పెట్టవు. నీ పరిశుద్ధునికి కుళ్ళు పట్ట నియ్యవు. జీవమార్గమును నీవు నాకు తెలియజేసెదవు". మార్కు 16:6-7 వచనాల్లో ఈ మాటల నెరవేర్పును గూర్చి మనమెరుగుదుము. "అందుకతుడు - కలవర పడకుడి సిలువ వేయబడిన నజరేయుడగు యేసును మీరు వెదకుచున్నారు; ఆయన లేచియున్నాడు. ఇక్కడలేడు. వారు ఆయనను ఉంచిన స్థలము చూడుడి". అ॥కా 2:22-28, ఎఫె 4:8, I కొరింధి 15:4 కూడ చదవండి. ఆయన కీర్తనల గ్రంధమును నెరవేర్చుటకు వచ్చెను.

క్రీస్తును గూర్చి యెషయా ప్రవక్త ప్రవచించెను: "అతడు దౌర్జన్యము నొందెను. బాధింపబడినను అతడు నోరు తెరవలేదు. వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు బొచ్చుకత్తిరించు వాని యెదుట గొఱ్ఱెయు మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరువలేదు". యెష 53 : 7. పొంతు పిలాతు ఎదుట మన ప్రభువైన యేసు ఉన్న సమయంలో ఈ ప్రవచనం నెరవేరెను. "పిలాతు.... నీ మీద ఎన్నెన్ని నేరములు మోపుచున్నారో చూడు మనెను. అయినను యేసు మరి ఏ ఉత్తరము చెప్పలేదు గనుక పిలాతు ఆశ్చర్యపడెను". మార్కు 15 : 3-5.

యింకా అనేక ప్రవచనాలున్నాయి. అన్నియు క్రీస్తులో నెరవేర్చబడినవి. "నెరవేర్చుటకే గాని కొట్టి వేయుటకు నేను రాలేదు" అని క్రీస్తు పలికిన మాట యొక్క అర్థం గ్రహించి యున్నారని భావిస్తున్నాను.

## క్రొత్త నిబంధన

దేవుడు ఒక క్రొత్త నిబంధనను వాగ్దానము చేసెను. అది నూతనమైనది, ఆత్మీయ నిబంధన. "ఇదిగో నేను ఇశ్రాయేలు వారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయుదినములు వచ్చుచున్నవి. ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులో నుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున వారి పితరులతో నేను చేసిన నిబంధన వంటిది కాదు. నేను వారి పెనిమిటినైనను వారు ఆ నిబంధనను భంగము చేసికొనిరి. యిదే యెహోవావాక్కు. ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలు వారితోను, యూదా వారితోను చేయబోవు నిబంధన యిదే, వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను. వారి హృదయము మీద దాని వ్రాసెదను" (యిర్మీ 31:31-33). ఒక ప్రశ్న. ఒక నిబంధన (పాత నిబంధన) ఉన్నసమయంలోనే క్రొత్త నిబంధనను దేవుడెందుకు వాగ్దానము చేయవలసి వచ్చెను ? "ఈయన యైతే ఇప్పుడు మరియెక్కువైన వాగ్దానములను బట్టి నియమింపబడిన మరియెక్కువైన నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు గనుక మరి శ్రేష్ఠమైన సేవకత్వము పొందియున్నాడు. ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవ దానికి అవకాశముండనేరదు" హెబ్రీ 8:6-7.

సబ్బాతు ఆచరణ, సున్నతి, జంతుబలులు మొదలగు ధర్మశాస్త్ర సంబంధమైన విధుల నుండి క్రీస్తు మనలను విడుదలచేసెను. పాత నిబంధన నుండి వాటి విధుల నుండి క్రీస్తు మనలను విడిపించెను (రోమా 10:4). "దేవుడు వ్రాత రూపకమైన ఆజ్ఞల వలన మన మీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను.... కాబట్టి అన్న పానముల విషయములోనైనను, పండుగ అమావాస్య విశ్రాంతి దినము విషయములోనైనను మీకు తీర్పుతీర్చ నెవనికిని అవకాశ మియ్యకుడి. ఇవి రాబోవు వాటి ఛాయయేగాని నిజస్వరూపము క్రీస్తులో ఉన్నది" (కొలొస్స 2:14-17).

ఒక ప్రశ్న : నీ శరీరము, నీనీడ ఏది గొప్పది ? శరీరమా ? లేక ఛాయ ? ధర్మశాస్త్రము రాబోవు మేలుల విషయమైన ఛాయ అయితే రాబోవు మేలు క్రొత్త నిబంధనయే కదా ! (హెబ్రీ 8:6).

"మావలన ఏదైన అయినట్లుగా ఆలోచించుటకు మాయంతట మేమే సమర్థులమని కాదు. మా సామర్థ్యము దేవుని వలననే కలిగియున్నది. ఆయనే మమ్మును క్రొత్త నిబంధనకు అనగా అక్షరమునకు కాదు గాని ఆత్మకే పరిచారకుల మవుటకు మాకు సామర్థ్యము కలిగించియున్నాడు. అక్షరము చంపును గాని ఆత్మ జీవింపచేయును" (II కొరింధీ 3:5-6).

రెండు నిబంధనలు దేవుని నుండి కలిగినవే. ఎందుచేత దేవుడు మనలను క్రొత్తనిబంధనను బట్టియే ఆరాధించు వారిగ చేసెను? ఎందుచేతనంటే మనము క్రొత్త నిబంధనను బట్టి తీర్పుతీర్చబడవలసిన వారమైయున్నాము. (యోహా 12:48, మత్త 17:1-5). మోషే, ఏలీయాల మాటకాదు గాని క్రీస్తు మాట వినవలెనని మనలను దేవుడు కోరుచున్నాడు. IIకొరింధీ 3వ అధ్యాయమంతయు మీరు చదువ వలెనని కోరుచున్నాను. మీరు ఈ వాక్యభాగాలు చదివితే మనము మొదటి నిబంధన క్రింద ఎందకు లేము ? అను ప్రశ్నకు జవాబు కనుగొనగలరు. పాత నిబంధన ఆరాధన రాబోవు మేలులు ఛాయయే. క్రొత్త నిబంధన ఆరాధన ఆమేలుల యొక్క నిజస్వరూపము.

"మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరుచేయబడియున్నారు. కృపలో నుండి తొలగిపోయి యున్నారు" (గలతి 5:4). నీవు ధర్మశాస్త్రము వలన నీతి మంతుడవని తీర్పుతీర్చబడ గోరుచున్నట్లయితే క్రీస్తుకు నీకు ఎట్టి సంబంధములేదు. నీవు కృపలో నుండి తొలగిపోయిన వాడవే. "కాబట్టి మనము విశ్వాస మూలమున నీతిమంతుల మని తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాల శిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడి ఆయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" (గలతీ 3:24-25). నీవు యింకా బాలశిక్షకుని క్రిందనే ఉన్నావా ? లేవు.

మనము ఈనాడు పాతనిబంధన క్రింద జీవించుట లేదు. ఎందుకంటే మనము క్రొత్తనిబంధన ద్వారా తీర్పుతీర్చబడవలసిన వారమైయున్నాము. (యోహా 12:48). అందుచేత ధర్మశాస్త్ర విధులను మనము నిర్వర్తించవలసిన అవసరం లేదు. లేదా ఆకట్టడల యందు నిలిచియుండ వలసిన అవసరంలేదు.

"క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు. ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2 యోహా : 9).

"వారు ఆశించిన ప్రకారము మనము చెడ్డవాటిని ఆశించకుండునట్లు ఈ సంగతులు మనకు దృష్టాంతములుగా ఉన్నవి" (I కొరింధి 10:6). "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి యుగాంత మందున్నమనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను." (I కొరింధీ 10:11).

మీరు యింకా వివరంగా తెలిసికొన గోరిన యెడల మీకు దగ్గరలో నున్న క్రీస్తు సంఘాన్ని దర్శించండి.

- జాన్ నేట్ కిస్సీ

- - 0 - -

# క్రైస్తవ ఆరాధనలో వాయిద్య సంగీతము దేవుని నుండి కలిగినదా ? మానవుని నుండి కలిగినదా ?

## (Is Instrumental Music in Christian Worship from God or Man ?)

మొదటి శతాబ్దపు సంఘం ఆరాధనలో వాయిద్యసంగీతము ఉపయోగించిరా? లేదా ? అను ప్రశ్నకు జవాబు కావాలంటే క్రొత్తనిబంధన పేజీలను చదవాలి. క్రొత్త నిబంధనలోని పది వాక్యభాగాలు ఈ ప్రశ్నకు స్పష్టమైన జవాబును యిచ్చుచున్నవి. ఒక్కొక్క వాక్య భాగాన్ని పరిశీలించు...

1. "అంతట వారు కీర్తన పాడి ఒలీవలకొండకు వెళ్ళిరి". మత్త 26:30
2. "అంతట వారు కీర్తన పాడి ఒలీవల కొండకు వెళ్ళిరి ". మార్కు 16:26
3. "అయితే మధ్యరాత్రివేళ పౌలును సీలయు దేవునికి ప్రార్థించుచు కీర్తనలు పాడుచు నుండిరి. ఖయిదీలు వినుచుండిరి". అ॥కా 16:25
4. "ఈ హేతువు చేతను అన్యజనులలో నేను నిన్ను స్తుతింతును; నీ నామ సంకీర్తనము చేయుదును". రోమా 15:9
5. "కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును; ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును". I కొరింథీ 14:15
6. "ఒకని నొకడు కీర్తనలతోను సంగీతముల తోను ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు, బుద్ధిచెప్పుచు కృపాసహితముగా మీ హృదయములలో గానము చేయుచు." కొలస్స 3:16.

7. "ఒకని నొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడచు కీర్తించుచు...." ఎఫె 5:19.

8. "-----నీ నామమును నా సహోదరులకు ప్రచుర పరతును, సమాజము మధ్య నీకీర్తిని గానము చేతును". హెబ్రీ 2:12

9. "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతి యాగము చేయుదము. అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము". హెబ్రీ 13:15

10. "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను; ఎవనికైనను సంతోషము కలిగెనా ? అతడు కీర్తనలు పాడవలెను". యాకో 5:13.

ఈ వాక్య భాగములను చదివిన ప్రతి మంచి వ్యక్తి క్రొత్త నిబంధన గాత్రసంగీతమును గూర్చి అనగా పాడుటను గూర్చి చెప్పుచున్నదని ఒప్పుకొనును. క్రొత్త నిబంధన ఆరాధనలో వాయిద్య సంగీతమునకు స్థానము లేదు. ఈ వాక్య భాగాలు పియానో, ఆర్గను లేదా యితర వాయిద్యములను సంఘములో ఉపయోగించుటను గూర్చిచెప్పలేదు. క్రీస్తు సంఘము దాని ఆరాధనలో వాయిద్యములను ఉపయోగించదు. వారు పాడుదురు. క్రైస్తవ ఆరాధనలో వాయిద్య సంగీతము మానవుల నుండియే కలిగినదనే విషయం మనకు స్పష్టమగుచున్నది. సంఘము ప్రారంభింపబడిన కొన్ని వందల సంవత్సరాల తరువాత వాయిద్యములు కొన్ని ఆరాధనలలో ప్రవేశ పెట్టబడినవి. క్రీస్తు తరువాత 670 సంవత్సరాలకు మొట్టమొదట, ఆరాధనలో ఆర్గను ప్రవేశపెట్టబడినది. పోప్ వైటాలిన్ అనునతడు ఈ ఆర్గనును ప్రవేశపెట్టెను. ఈ విషయము రోమన్ కేథలిక్ సంఘములో విభజన కలుగ జేయుటయేగాక భయోత్పాతమును సృష్టించెను. క్రీస్తు తరువాత 800 సంవత్సరములకు కొంత

వ్యతిరేకమున్నను రోమన్‌కేథలిక్ సంఘము లోనికి తిరిగి ఆర్గను ప్రవేశపెట్టబడెను. గ్రీకు కేథలిక్ సంఘము దీనిని వ్యతిరేకించెను. గ్రీకు కేథలిక్ సంఘము నేటికిని దీనిని వ్యతిరేకించుచున్నది.

క్రీస్తు స్థాపించిన సంఘ ఆరాధనలో వాయిద్యములు ఉపయోగించ లేదనునది స్పష్టము. క్రొత్తనిబంధన దానికి అధికారమివ్వలేదు. క్రీస్తు తరువాత కొన్ని సంవత్సరాల వరకు వాయిద్యములు ప్రవేశపెట్టబడలేదని చరిత్ర స్పష్టంగా వివరించుచున్నది.

వాయిద్యములను ఆరాధనలో ఉపయోగించేవారు వాటి[illegible]ంచే ప్రయత్నంలో ఒక ప్రశ్న అడుగుదురు. "పాత నిబంధనలో వాయి[illegible] ఉపయోగింపబడ లేదా?". దీనికి సమాధానము అవును. 150 వ కీర్తన వివిధ వాయిద్యములు దేవుని స్తుతించుటకు వారు ఉపయోగించిరని చెప్పుచున్నది. పాత నిబంధన ఆరాధనలో నున్న అంశాన్ననుసరించి క్రొత్త నిబంధన కాలంలో మనం ఆరాధించ వలసిన అవసరం లేదు. నీవు జంతుబలులను నేడు ఎందుకర్పించవు? అని నిన్ను అడిగితే, "అది పాత నిబంధన ఆరాధనలో ఒక భాగమని " నీవు చెబుతావు. నీ సమాధానం సత్యం. ఎందుకంటే మనం మోషే ధర్మశాస్త్రం క్రింద లేము (రోమా 7:4-7; II కొరింధీ 3:7-11, కొలస్స 2:14). మనం ఏవిధంగా ఆరాధించాలో నేడు క్రీస్తు చట్టం తెలియజేయుచున్నది. నేడు జంతుబలులు, ధూపము ఆరాధనలోకి తీసుకొని వచ్చుట యెట్టిదో వాయిద్యములను తీసుకొని వచ్చుట కూడ అట్టిదే.ఎందుకంటే మొదటి శతాబ్దపు ఆరాధనలో వాయిద్యములు లేవు. వారు పాడుటకు ఆజ్ఞాపింపబడిరి. దేవుని సంకల్పముతోనే తృప్తి పొందుదాం. యేసు, "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెననెను". (యోహా 4:24).

- కెన్ టైలర్

- - 0 - -

# సంక్షిప్త వార్తలు

జూన్ నెల సువార్తికుల సదస్సు 28వ తేదీన ప॥గో॥జిల్లా పెనుమద్రులో ఆశీర్వాదకరముగా జరిగెను. దేవుడు ప్రశాంతమైన వాతావరణము అను గ్రహించగా సువార్తికులు అనేక ప్రాంతముల నుండి తరలి వచ్చిరి. "సంఘము క్రీస్తు నామమును ధరించవలెనా ? ఎందువలన ? " అను అంశము చర్చింపబడెను.

ఉదయం సోదరులు వి. చిన్నయ్యగారు అధ్యక్షులై యుండగా మధ్యాహ్నం సోదరులు టి. సిహెచ్. ఫ్లెమింగ్స్ గారు అధ్యక్షత వహించిరి. సోదరులు డి. సత్యం, డి. రంగారావు, పి. సామ్యేలు, పాల్ గూటం, యన్. మోజెస్, జి. షడ్రక్ మరియు జాషువా గూటం గార్లు పై అంశముపై చక్కని వర్తమానమును అందించిరి.

సంఘము క్రీస్తు నామమున పిలువబడ నవసరము లేదని, ఏ నామమున పిలువ బడినను అది క్రీస్తునకే చెందునని అనేకులు అభిప్రాయ పడుచున్నారు.

సంఘము క్రీస్తు నామమును ధరించవలెనా ? అను ఈ ప్రశ్నకు దేవుని వాక్యపు వెలుగులో సమాధానమును అన్వేషించాలి. సంఘమునకు క్రీస్తునకు మధ్యగల సంబంధమును గూర్చి లేఖనములలో విలువైన సమాచారము వ్రాయబడింది. ఆయన "దానికొరకు (సంఘము కొరకు) తన్నుతాను అప్పగించుకొనెను" ఎఫె 5:25. సంఘము కొరకు తన ప్రాణమును పెట్టి తన విలువైన రక్తముతో దానిని సంపాదించిన క్రీస్తు నామమున ఆదిమ సంఘముపిలువబడింది (రోమా 16:16). సంఘము క్రీస్తు యొక్క సంపూర్ణత (ఎఫె 1:23) ఆయన సంఘమునకు శిరస్సు, ఆ సంఘము ఆయన శరీరము గనుక క్రీస్తునకు సంఘమునకు మధ్య విడదీయలేని సంబంధము కలదు. క్రీస్తు కావాలా ? సంఘము కావాలా ? అని ప్రశ్నించే వారికి లేఖనాలు గుణపాఠం చెప్పుచున్నవి. ఆయన భార్యయైన సంఘము ఆయన నామమును ధరించినప్పుడే అది ముడత యైనను, కళంకమైనను అట్టిది మరియేదైనను లేనట్టి మహిమగల సంఘముగ నుండగలదు. ఆయన సర్వాధికారి. మత్త 28:18. ఆయన రక్షకుడు, ఆయన సంఘమును కట్టిన వాడు (ఎఫె 5:23, మత్త 16:18). "ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము" (కొలస్స 1:18), సంఘము

ఆయన పేరట పిలువ బడవలెను. "సమస్తము ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17) అని మనం హెచ్చరింప బడితిమి. వేరొక నామమున పిలువబడుచున్న సంఘము క్రీస్తునకు ఎట్లు చెందును? అని సోదరులు ప్రశ్నించిరి. "క్రీస్తు యేసే ముఖ్యమైన మూల రాయియై యుండగా" కట్టబడియున్న క్రీస్తు సంఘము క్రీస్తుపేరట గాక మరొక పేరుతో పిలువబడ రాదు. ఎఫె 2:20 క్రీస్తు నామమును ధరించిన క్రీస్తు సంఘము దాని ఆరాధనలోను, రక్షణ సంకల్పమును ప్రకటించుటలోను, దాని పరిపాలనలోను, ప్రేమలోను, మాదిరిలోను, బోధలోను క్రీస్తు మాటలను అనుసరించును. (రోమా 6:17).

సంఘమును గూర్చి సరి అయిన అవగాహన లేని వారు అంటే సంఘమును గూర్చి పరిశుద్ధ గ్రంధములో చదివి గ్రహించలేని వారు సంఘమునకు తమ యిష్టమయిన పేరుపెట్టుకొనిరి. ఆ పేరు అది మతశాఖయనే విషయాన్ని తెలియజేయుచున్నది. శిరస్సు మూలముగా, సర్వశరీరము....పోషింపబడి అతుకబడినదై దేవుని వలన కలుగు వృద్ధితో క్రీస్తు నామమును సంఘము ధరించవలెను.

---

Regd. No. H/KD-45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA - 533 001

To